సాక్షి నాగర్‌కర్నూల్

మంగళవారం । 29 । ఏప్రిల్ । 2025



బాల్యానికి బంధనం

బాల్య వివాహాల నియంత్రణకు ప్రభుత్వం చట్టాలు తెచ్చినా జరుగుతూనే ఉన్నాయి.

వివరాలు 8లో ▸



సహాయక చర్యలకు విరామం

ఎస్‌ఎల్‌బీసీలో సహాయక చర్యలు నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 41.5/21.6

ఉదయం నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతతో పాటు వేడి గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ప్రజావాణికి 21 వినతులు



నాగర్‌కర్నూల్: జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 21 వినతులు వచ్చాయి. జిల్లా నలు మూలల నుంచి వచ్చిన దరఖాస్తుదారులతో కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్ వినతులు స్వీకరించి ఆయా విభాగాల సిఫారస్ చేసి మాట్లాడారు. ప్రజా సమస్యలు త్వరగా పరిష్కరించేందుకు ప్రజావాణి నిర్వహిస్తున్నామని.. ప్రజల వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, అన్నిశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీసు ప్రజావాణికి 12..



నాగర్‌కర్నూల్ క్రైం: పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులు త్వరగా పరిష్కరించేందుకు సిబ్బంది కృషి చేయాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 12 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఫిర్యాదుదారులతో ఆయన నేరుగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకొని సంబంధిత పోలీసు అధికారులకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. భూ సమస్యలకు సంబంధించి 4, భార్యాభర్తల గొడవలకు సంబంధించి ఒకటి, వేర్వేరు ఫిర్యాదులు 7 వచ్చినట్లు వివరించారు.

నేడు మద్యం బార్‌ల కేటాయింపు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలోని అచ్చంపేటలో లైసెన్స్ రెన్యూవల్ కాని రెండు మద్యం బార్‌ల స్థానంలో కొత్త వాటి ఏర్పాటుకు 18 దరఖాస్తులు వచ్చాయి. మంగళవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ సమక్షంలో లాటరీ విధానంలో కొత్త వారిని ఎంపిక చేయనున్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయత్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు ఉదయం 10 గంటలలోగా వారికి కేటాయించిన ఎంట్రీ పాసులు తీసుకొని హాజరు కావాలని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కందనూలు: హైదరాబాద్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా టెక్నికల్ శిక్షణ సంస్థలో 2025–26 విద్యాసంవత్సరానికిగాను పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి రాజేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి పూర్తి చేసిన అనాథ బాలికలు, ఎలాంటి ఆధారం లేని బాలికలు మాత్రమే అర్హులని.. ఎలాంటి అర్హత పరీక్ష లేకుండా నేరుగా ప్రవేశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారానికి సంబంధిత ధ్రువీకరణ పత్రాలు జతచేసి బాలరక్షా భవన్, రూం.నం. 308, పాత కలెక్టర్ కార్యాలయం, నాగర్‌కర్నూల్‌లో మే 17లోగా అందజేయాలని సూచించారు.

కాంగ్రెస్‌లో సంస్థాగత నియామకాల సందడి

స్టేషన్ మహబూబ్‌నగర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సమాయత్తమవుతోంది. ఎన్నికలలోపే మండల, బ్లాక్, డీసీసీ అధ్యక్షులు, ఇతర కార్యవర్గాల ఎంపిక కోసం కార్యాచరణ సిద్ధం చేస్తుంది. అందులో భాగంగానే ఇటీవలే జిల్లాలకు సంబంధించి ప్రత్యేకంగా పీసీసీ పరిశీలకులను నియమించింది. మహబూబ్‌నగర్ జిల్లాకు దొమ్మాటి సాంబయ్య, గజ్జి భాస్కర్‌యాదవ్‌లను పీసీసీ పరిశీలకులుగా నియామకం చేసింది. ఈ మేరకు పీసీసీ పరిశీలకుల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. సమావేశానికి ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, చైర్మన్లు, పీసీసీ, డీసీసీ కార్యవర్గంతోపాటు మండల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హాజరుకానున్నారు. మండల, బ్లాక్ కాంగ్రెస్, డీసీసీ కార్యవర్గం నియామకంపై సమావేశంలో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీకి సంబంధించి సంస్థాగత నియామకాల కోసం వచ్చేనెల 4 నుంచి 10 వరకు నియోజకవర్గ స్థాయిలో, 13 నుంచి 20 వరకు మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించనున్నారు. మండల స్థాయిలో ఐదుగురు, బ్లాక్ కాంగ్రెస్‌కు నలుగురు, డీసీసీ అధ్యక్షుడికి ముగ్గురి పేర్లతో కూడిన జాబితాను టీపీసీసీకి నివేదించనున్నారు. వచ్చే నెల చివరి వారంలో మండల, బ్లాక్ కాంగ్రెస్, డీసీసీ అధ్యక్షుల పేర్లు ఖరారయ్యే అవకాశం ఉంది.

స్పందన అంతంతే..

ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణకు ముందుకు రాని ప్లాట్ల యజమానులు



అచ్చంపేట పట్టణ వ్యూ

- 25 శాతం రాయితీ ఇచ్చి గడువు పెంచినా నెరవేరని లక్ష్యం
- ఉమ్మడి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో అదే పరిస్థితి
- విస్తృతంగా ప్రచారం కల్పించినా కనిపించని ఫలితం
- మరో రెండు రోజులే అవకాశం

ఉమ్మడి జిల్లా పరిధిలో ఇలా..

మొత్తం దరఖాస్తులు	ఆమోదించినవి
1,95,963	1,40,299

రుసుం చెల్లించినవి	క్రమబద్ధీకరించినవి
32,781	13,765

ప్రభుత్వానికి సమకూరిన ఆదాయం రూ.58.38 కోట్లు

అచ్చంపేట: అనధికార లే–అవుట్‌లోని స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం 25 శాతం రాయితీ కల్పించి గడువు పెంచినా మున్సిపాలిటీల్లో లక్ష్యం నెరవేరలేదు. నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం ఇటీవల అవకాశం కల్పించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మొదట మార్చి 31 నాటికి క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించారు. అయితే ప్రభుత్వం ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడంతో ఈ నెల 30 వరకు మరోసారి గడువు పొడిగించింది. కాగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 19 మున్సిపాలిటీల్లో సోమవారం వరకు 32,781 దరఖాస్తుదారులు ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణ కోసం రుసుం చెల్లించడంతో ప్రభుత్వానికి రూ.55.38 కోట్ల ఆదాయం సమకూరింది.

25 శాతం రాయితీతో..

2020 ఆగస్టు 31 నాటికి ఉన్న అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించేందుకు గత ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే వివిధ కారణాలతో దరఖాస్తుదారులకు అనుమతులు మంజూరు చేసే ప్రక్రియలో ఆలస్యం కావడంతో ముందుకు సాగలేదు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇందులో కొన్ని నిబంధనలు చేర్చింది. దీని ప్రకారం 2025 మార్చి 31లోగా క్రమబద్ధీకరణ చార్జీలు, ఓపెన్ స్పేస్ చార్జీలు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ కల్పిస్తూ ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం కల్పించింది. అయితే పెద్దగా స్పందన రాకపోవడంతో 25 శాతం రాయితీ గడువును ఈ నెల 30 వరకు పొడిగించింది.

ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల వారీగా ఇలా..

మున్సిపాలిటీ	మొత్తం దరఖాస్తులు	ఆ.వి	రుసుం చెల్లించినవి	క్ర.వి	సమకూరిన ఆదాయం (రూ.కోట్లలో)
నాగర్‌కర్నూల్	16,158	10,782	2,588	1,522	4.20
కల్వకుర్తి	11,482	9,491	1,936	806	4.11
అచ్చంపేట	12,045	10,765	1,765	94	2.53
కొల్లాపూర్	4,595	3,718	662	238	1.17
అలంపూర్	431	366	121	61	0.15
వడ్డేపల్లి	1,941	1,787	355	279	0.68
అయిజ	9,845	5,244	1,074	652	1.34
గద్వాల	14,387	4,000	1,700	848	2.74
జడ్చర్ల	17,684	11,070	2,597	819	5.68
మహబూబ్‌నగర్	31,438	22,183	6,817	2,160	15.62
భూత్పూర్	6,119	4,703	1,260	590	2.12
పెబ్బేరు	7,306	6,484	1,443	391	1.74
కొత్తకోట	7,582	7,318	1,284	648	1.50
ఆత్మకూర్	3,812	3,150	731	623	0.86
అమరచింత	447	333	162	121	0.51
వనపర్తి	29,072	25,820	4,693	2,499	5.80
మక్తల్	10,577	9,062	1,170	563	2.15
కోస్గి	3,982	1,987	904	135	1.81
నారాయణపేట	7,060	2,036	1,519	707	3.67

ఆ.వి: ఆమోదించినవి | క్ర.వి: క్రమబద్ధీకరించినవి

సద్వినియోగం చేసుకోవాలి



ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఫీజు చెల్లించి ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలి. ఫీజు చెల్లించిన వారికి వెంటనే ప్రొసీడింగ్స్ అందజేస్తున్నాం. 25 శాతం రాయితీ గడువు మరో రెండు రోజులు మాత్రమే ఉంది. ఈ ప్రక్రియపై ఎలాంటి సందేహాలున్నా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లను సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చు. మున్సిపల్ సిబ్బంది ఇప్పటికే దరఖాస్తుదారులకు లెటర్లు పంపించడం, ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడం జరిగింది.

– యాదయ్య, మున్సిపల్ కమిషనర్, అచ్చంపేట

విస్తృతంగా ప్రచారం..

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులో 25 శాతం రాయితీ కల్పించిన ప్రభుత్వం వందశాతం లక్ష్యం నెరవేర్చాలని అధికారులను ఆదేశించింది. దీంతో ఈ పథకంపై అధికార యంత్రాంగం విస్తృత ప్రచారం కల్పించింది. ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో అధికారులు సామాజిక, ప్రసార మాధ్యమాలు, ఇతర విభాగాల ద్వారా అవగాహన కల్పించినప్పటికీ దరఖాస్తుదారులు పెద్దగా ముందుకు రాలేరు. సోమవారం వరకు క్రమబద్ధీకరణకు 32,781 మంది దరఖాస్తుదారులు రుసుం చెల్లించగా 13,765 మందికి క్రమబద్ధీకరణ ఉత్తర్వులు జారీ చేశారు. సుమారు 55,664 దరఖాస్తులను నిషేధిత జాబితాలో చేర్చడంతో సంబంధిత దరఖాస్తుదారులు వాటిని సరి చేయాలంటూ ఆయా శాఖల అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. సాంకేతిక కారణాలతో నిషేధిత జాబితాలోకి వెళ్లాయని, సంబంధిత స్థలాల ఆధారాలు అందిస్తేనే వాటిని సరి చేస్తామని ఓ అధికారి పేర్కొన్నారు. అయితే 25 శాతం రాయితీ గడువుకు బుధవారం (ఈ నెల 30) వరకు మాత్రమే గడువు ఉండటంతో ఎంత మేరకు లక్ష్యం చేరుకుంటారో వేచి చూడాల్సిందే.

భూ భారతిపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ విజయేందిర బోయి

- రికార్డులను క్రమబద్ధీకరించేందుకే రెవెన్యూ సదస్సులు
- ఇన్‌చార్జ్ కలెక్టర్ విజయేందిర బోయి

తిమ్మాజిపేట: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఈ చట్టం ప్రకారం భూముల రికార్డులు క్రమబద్ధీకరించేందుకు త్వరలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని ఇన్‌చార్జ్ కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో భూ భారతిపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భూ భారతి చట్టంలో తహసీల్దార్‌కు సమస్య పరిష్కరించే అధికారం ఉందని.. ఆయన పరిష్కరించకుంటే ఆర్డీఓ, కలెక్టర్, కమిషనర్ వరకు వెళ్లవచ్చన్నారు. 30 రోజుల్లో సమస్య పరిష్కారంగాకపోతే ఆన్‌లైన్‌లోనే రికార్డు వస్తుందని తెలిపారు. త్వరలోనే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని.. అవసరమైన ధ్రువపత్రాలు అధికారులకు చూపించాలన్నారు. ఇప్పటి వరకు అక్రమంగా ఉన్న పట్టాలను రద్దు చేస్తామని చెప్పారు. అంతకుముందు అదనపు కలెక్టర్ అమరేందర్, ఆర్డీఓ నరేష్ చట్టం గురించి సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామకృష్ణయ్య, డీటీ జ్యోతి, ఆర్‌ఐలు రవిచంద్ర, హారిక, శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే..



తెలకపల్లిలో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అమరేందర్

బిజినేపల్లి: తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టంతో రైతుల భూ సమస్యలు పరిష్కారమవుతాయని అదనపు కలెక్టర్ పి.అమరేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జూన్ 2 నుంచి గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి రైతుల భూ సమస్యలు పరిష్కారం చేస్తారని.. రెవెన్యూ అధికారులే స్వయంగా గ్రామాలకు వస్తారన్నారు. గ్రామ సభల నిర్వహణ తేదీలను ముందుగానే గ్రామ ప్రజలకు చాటింపు ద్వారా తెలియజేస్తారని చెప్పారు. భూ సమస్యలు పరిష్కరించడానికి ఇదో సరైన సమయమని వివరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సురేష్, తహసీల్దార్ శ్రీరాములు, ఉప తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ కతలప్ప, ఏఓ నీతి, రైతులు పాల్గొన్నారు.

భూ భారతితో సమస్యలు పరిష్కారం..

తెలకపల్లి: భూ భారతి ద్వారా రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని అదనపు కలెక్టర్ అమరేందర్ అన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం భూముల ధరలు పెరగడంతో గ్రామాల్లో భూ సమస్యలు పెరిగాయని.. రైతులు ఏ సమస్యలున్నా ముందుగా తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకుంటే పరిష్కరిస్తారని, అక్కడ పరిష్కారంగాకపోతే ఆర్డీఓ, కలెక్టర్‌స్థాయిలో పరిష్కరిస్తారని చెప్పారు. త్వరలో గ్రామ పాలన అధికారులను నియమిస్తామని తెలిపారు. రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ సురేష్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ యాదయ్య, మార్కెట్ వైస్ చైర్మన్ చిన్ననిజంగయ్య, తహసీల్దార్ జాకీర్ అలీ, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు

చదువుతోనే ఉన్నత శిఖరాలకు..



మాట్లాడుతున్న న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి నసీం సుల్తానా

నాగర్‌కర్నూల్ క్రైం: విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయమూర్తి నసీం సుల్తానా కోరారు. సోమవారం జిల్లాకేంద్రం సమీపంలోని కొల్లాపూర్ క్రాస్‌రోడ్‌లో ఉన్న జ్ఞానేశ్వర వాత్సల్య మందిరం అనాథ ఆశ్రమాన్ని ఆమె సందర్శించి నిర్వాహకులతో మాట్లాడి మౌలిక వసతులపై ఆరా తీశారు. ప్రతి చిన్నారితో వ్యక్తిగతంగా మాట్లాడి సమస్యలుంటే న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని చెప్పారు. విద్యార్థులు తమ జీవిత లక్ష్యాన్ని ఎంచుకొని సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు మధుసూదన్‌రావు, శ్రీరామ్ ఆర్య, పవన శేషసాయి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ రుణ లక్ష్యం రూ.600 కోట్లు



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి

ఉప్పునుంతల: ఈ ఆర్థిక సంవత్సరంలో డీసీసీబీ ద్వారా రూ.600 కోట్ల రుణాలు ఇవ్వాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక పీఏసీఎస్‌లో చైర్మన్ సత్తు భూపాల్‌రావుతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సంఘ సభ్యులు తమ పూర్తి సహకారాన్ని అందజేసి రైతులకు పంట, ఇతర రుణాలు అందించేలా చూడాలని సూచించారు. అలాగే స్థానిక పీఏసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ సమస్యలతో ఓటీఎస్ ద్వారా రైతుల నుంచి కొంత అధికంగా రుణ బకాయిలు వసూలు చేశామని.. జరిగిన పొరపాటును సరిచూసుకున్న వెంటనే వసూలు చేసిన ఎక్కువ డబ్బులను మార్చిలోనే తిరిగి వారి సొంత ఖాతాలో జమ చేశామని, ఎలాంటి అక్రమాలు చోటుచేసుకోలేదని వివరించారు. నాబార్డ్, టిస్కాబ్ రుణాలు పొందాలంటే రుణ రికవరీ శాతం పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇందుకోసం డీసీసీబీకి రూ.21 కోట్లు నష్టం వాటిల్లినా.. ఓటీఎస్ ద్వారా మొండి బకాయిలు వసూలు చేసినట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న 78 సహకార పరపతి సంఘాల్లో 39 సంఘాలు మాత్రమే 50 శాతం మేర రుణాలను రికవరీ చేసేవని.. ఓటీఎస్‌తో మరో 16 సంఘాలు రుణ రికవరీ శాతం 50 శాతం దాటిందని వివరించారు. సమావేశంలో డీసీసీబీ సీఈఓ పురుషోత్తం, అచ్చంపేట డీసీసీబీ మేనేజర్ రవికుమార్, పీఏసీఎస్ సీఈఓ రవీందర్‌రావు పాల్గొన్నారు.

శాంతిభద్రతలు పరిరక్షించాలి : ఎమ్మెల్యే




పోలీసులతో సమావేశమైన ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: నియోజకవర్గంలో శాంతిభద్రతలు పరిరక్షించాలని ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ కోరారు. సోమవారం పట్టణంలో పోలీసు అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ కుట్రలను సహించేది లేదని, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే సామాన్యులకు న్యాయం చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పట్టణంలో ప్రతిష్టాత్మకమైన నిర్వహించే బొడ్రాయి పండుగకు భద్రతా చర్యలపై సమీక్షించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్, ఎస్‌ఐలు రమేశ్, పవన్‌కుమార్, వెంకటరెడ్డి, ఇందిర పాల్గొన్నారు.

ధరణి ఆపరేటర్లకు 14 నెలలుగా అందని జీతాలు

- ఏజెన్సీ రద్దుతో టీజీటీఎస్‌కు అటాచ్
- ప్రభుత్వ ఆదేశాలు అందక ఆగిన వైనం
- జిల్లాలో 23 మంది..



వేతన వెతలు..



పెద్దకొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో భూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో ధరణి ఆపరేటర్ (ఫైల్)

నాగర్‌కర్నూల్: జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో పనిచేసే ధరణి ఆపరేటర్లకు 14 నెలలుగా వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే అరకొర జీతాలు.. అందులో మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు అవికూడా సకాలంలో అందడం లేదు. సమస్యను పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించినా పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు ఎదురవుతున్నా.. ప్రభుత్వం మాత్రం దృష్టి సారించడం లేదని చెబుతున్నారు. జిల్లాకు వచ్చే మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా కూడా ఫలితం లేకపోయింది.

2018లో విధుల్లోకి ..

గత ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చి అన్ని మండలాల తహసీల్దార్లను జాయింట్ సబ్ రిజిస్ట్రార్లుగా నియమించింది. ఇందుకోసం తహసీల్దార్ కార్యాలయంలో గదిని ఏర్పాటుచేసి భూ రిజిస్ట్రేషన్ల కోసం ధరణి ఆపరేటర్లను నియమించింది. జిల్లాలో 23 మందిని ఆపరేటర్లుగా నియమించగా.. సుమారు ఆరేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రారంభంలో రూ.10 వేలు వేతనం చెల్లిస్తుండగా.. ప్రస్తుతం రూ.12,500 చెల్లిస్తున్నారు. మిగతా వారితో పోలిస్తే వీరి జీతాలు చాలా తక్కువే.. ప్రస్తుతం అవి కూడా సకాలంలో అందకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

టీజీటీఎస్‌కు అనుసంధానం..

మొదట వీరిని విధుల్లోకి తీసుకున్నప్పుడు 'టెరాసిస్' అనే ఏజెన్సీ ద్వారా వేతనాలు చెల్లించేవారు. గతేడాది జనవరిలో ఏజెన్సీ కాంట్రాక్ట్ గడువు ముగియగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గడువు పెంచకుండా నిలుపుదల చేసింది. అంతేగాకుండా ఆపరేటర్లను తెలంగాణ ప్రభుత్వ టెక్నికల్ సర్వీసెస్(టీజీటీఎస్)కు అనుసంధానం చేసి ఆ ఏజెన్సీ ద్వారా వేతనాలు చెల్లించేలా ఏర్పాట్లు చేసింది. గతేడాది ఫిబ్రవరి నుంచి ధరణి ఆపరేటర్లకు వేతనాలు చెల్లించాల్సి ఉంది. టీజీటీఎస్‌కు అనుసంధానం చేయడంతో ఉద్యోగాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆశపడినా.. కనీసం వేతనాలు కూడా రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం ఎలాంటి చొరవ చూపకపోవడంతో ఇప్పట్లో వేతనాలు అందుతాయన్న నమ్మకం కూడా కలగడం లేదని ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా విషయానికొస్తే 23 మంది ఆపరేటర్లు దాదాపు 14 నెలలుగా వేతనాల కోసం వేచి చూస్తున్నారు. కేవలం జిల్లాకే రూ.40 లక్షల వరకు రావాల్సి ఉంది.

ఇబ్బందులు పడుతున్నాం..



ప్రభుత్వం నుంచి మాకు వచ్చే జీతమే తక్కువ. అరకొర వేతనాలతో జీవితాన్ని నెట్టుకొస్తున్నాం. కానీ ప్రస్తుతం ఆ జీతం కూడా సకాలంలో రావడం లేదు. గతేడాది ఫిబ్రవరి నుంచి వేతనాలు అందాల్సి ఉంది. తప్పని పరిస్థితుల్లో ఆపరేటర్లు అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం ఈ విషయంపై చొరవ చూపాలి.

– రాంబాబు, జిల్లా అధ్యక్షుడు, ధరణి ఆపరేటర్స్ అసోసియేషన్

క్లుప్తంగా

యువకుడి బలవన్మరణం


దాసరి మల్లయ్య (ఫైల్)

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామంలోని లింగమయ్య కాలనీకి చెందిన మాజీ వార్డు సభ్యుడు దాసరి మల్లయ్య (38) బలవన్మరణానికి పాల్పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దాసరి మల్లయ్య కొంతకాలంగా అశాంతికి గురై ఒక్కడే ఆలోచన చేస్తూ ఉండేవాడని, ఈ క్రమంలో మతిస్థిమితం కోల్పోయి గ్రామంలోని చింతల చెరువులోని చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య శోభ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతికి సంబంధించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

కారు, బైకు ఢీకొని..

- ఒకరి దుర్మరణం



తాడూరు: కారు, బైకు ఢీకొని వ్యక్తి చనిపోయిన ఘటన మండలంలోని ఎంగంపల్లి గేటు, మేడిపూర్ మధ్య చోటు చేసుకుంది. ఎస్ఐ గురుస్వామి కథనం మేరకు.. మండలంలోని కల్వకోలు గ్రామానికి చెందిన పెబ్బేటి రాములు హైదరాబాద్ నుంచి ద్విచక్ర వాహనంపై సొంత గ్రామానికి వెళ్తుండగా నాగర్‌కర్నూల్ నుంచి కల్వకుర్తి వెళ్లే కారు బైకును ఢీకొనడంతో రాములు అక్కడికక్కడే మృతిచెందాడని తెలిపారు. కారు డ్రైవర్ పరారీలో ఉన్నాడని, మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి


ముజహర్ (ఫైల్)

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్ సమీపంలో యువకుడు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం రాత్రి 9.30 సమయంలో జటప్రోల్ గ్రామానికి చెందిన ముజహర్ (28) అనే యువకుడు కొల్లాపూర్ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా.. ట్రాక్టర్ ఢీకొట్టింది. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో పాటు కొల్లాపూర్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలియజేశారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్ఐ రామన్‌గౌడ్ తెలియజేశారు.

మిషన్ కిందపడి వ్యక్తి మృతి

మహమ్మదాబాద్: పొలంలో వరికోత మిషన్ టైరు కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన గండేడ్ మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని బల్సూర్‌గొండ గ్రామానికి చెందిన భీంరెడ్డి(50) సోమవారం తన వరికోత మిషన్‌తో అదే గ్రామానికి చెందిన మల్లెపల్లి కృష్ణారెడ్డి పొలంలో పంట కోస్తుండగా మిషన్ వెనుకాల ఉన్నాడు. ప్రమాదవశాత్తు మిషన్ కిందపడి తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు కోస్గి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని భార్య తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మహమ్మదాబాద్ ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తు తెలియని వ్యక్తి శవం

ఉప్పునుంతల: మండలంలోని శ్రీశైలం, హైదరాబాద్ రహదారిలో డిండి ప్రాజెక్టు కట్ట దిగువనున్న కట్టమైసమ్మ ఆలయం సమీపంలో శనివారం ఉదయం గుర్తు తెలియని శవాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కట్టమైసమ్మ ఆలయం సమీపంలో శవం ఉందని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకొని, మృతదేహానికి పంచనామా నిర్వహించి, అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. చనిపోయిన మగ వ్యక్తి సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉండి 5.5 అడుగుల ఎత్తు, చామనచాయ రంగు కోల ముఖం ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు స్కై బ్లూకలర్ షర్ట్, బూడిదరంగు ప్యాంట్ ధరించాడన్నారు. ఎడమ చేతిపై కన్పించని స్థితిలో పచ్చబొట్టు ఉందని పేర్కొన్నారు. చనిపోయిన వ్యక్తికి సంబంధించిన వివరాలు తెలిస్తే 87126 57738, 96032 14603 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉండవెల్లి: మండలంలోని కలుగోట్ల గ్రామానికి చెందిన శాంసన్ (42) ఈ నెల 25న కర్నూల్‌కు టీవీఎస్ లూనా బైక్‌పై ప్రయాణిస్తుండగా అలంపూర్ చౌరస్తాకు వెళ్లే మార్గంలోని పెట్రోల్ బంక్ సమీపంలో పెట్రోల్ ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో గాయాలపాలయిన శాంసన్‌ను 108 అంబులెన్స్ వాహనంలో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య రుతమ్మ ఫిర్యాదు మేరకు ట్యాంకర్ డ్రైవర్ భాస్కర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

బాల్యానికి బంధనం


మంతన్‌గోడ్‌లో అవగాహన కల్పిస్తున్న లీగల్ అడ్వైజర్ కవిత (ఫైల్)

- కట్టుబాట్లు, ఆర్థిక ఇక్కట్లతో బాల్యవివాహాలు
- విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నా మారని తల్లిదండ్రులు
- నారాయణపేట జిల్లాలో 2020 నుంచి ఇప్పటి వరకు 360 వివాహాలను అడ్డుకున్న అధికారులు

మక్తల్: పేదరికం, నిరక్షరాస్యత వంటి సామాజిక రుగ్మతలతో తల్లిదండ్రులు ఆడపిల్లలను భారంగా భావిస్తున్నారు. త్వరగా పెళ్లిళ్లు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. బాల్యవివాహాలను రూపుమాపేందుకు ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చినా ప్రజల్లో మార్పు రావడం లేదు. మారుమూల గ్రామాల్లో బాల్యవివాహాలు చేసేందుకు యత్నిస్తూనే ఉన్నారు. ఫలితంగా చిన్నారుల జీవితాల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయి. అడపాదడప అధికారులకు అందే సమాచారంతో చిన్నారి పెళ్లి కూతుళ్లకు విముక్తి లభిస్తున్నప్పటికీ.. బాల్యవివాహాలను పూర్తిస్థాయిలో అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారని పలువురు పేర్కొంటున్నారు.

సమాచారం అందితేనే..

గ్రామాల్లో బాల్యవివాహం చేస్తున్నట్లు సంబంధిత అధికారులకు సమాచారం అందిస్తేనే స్పందిస్తున్నారు. డీసీటీయూ, ఐసీడీఎస్, సఖి సిబ్బందితో పాటు పోలీసులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, పంచాయతీ సిబ్బంది అక్కడికి వెళ్లి బాల్యవివాహాలను నిలుపుదల చేస్తున్నారు. నారాయణపేట జిల్లాలో 2020 నుంచి ఇప్పటి వరకు 280 గ్రామపంచాయతీల్లో 360 బాల్యవివాహాలను అధికారులు అడ్డుకున్నారు. అందులో నారాయణపేట మండలంలో 109, మద్దూరులో 128, మక్తల్‌లో 54 బాల్యవివాహాలను నిలుపుదల చేశారు. ఒకవేళ అధికారులకు సమాచారం లేకపోతే బాల్యవివాహం సాఫీగా చేసేస్తున్నారు. బాల్యవివాహాన్ని ప్రోత్సహించే, సహకరించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నా.. ప్రజల్లో అవగాహన కొరవడి మార్పు రావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గ్రామస్థాయిలో మార్పు రావాలి

బాల్యవివాహాలతో కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. గ్రామస్థాయిలో మార్పు రావాల్సిన అవసరం ఉంది. ఎక్కడైనా బాల్యవివాహం చేయడానికి యత్నిస్తే.. గ్రామ కమిటీలు తక్షణమే స్పందించాలి. బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరం.
– కవిత, జిల్లా లీగల్ అడ్వైజర్

1098 సమాచారం అందించాలి..

బాల్యంలోనే వివాహం చేయడం వల్ల శారీరక, మానసిక ఎదుగుదల నిలిచిపోతుంది. గర్భాదారణ సమస్యలు తలెత్తుతాయి. పుట్టబోయే బిడ్డకు సైతం మానసిక, శారీరక ఎదుగుదల లేకుండా ఉండే అవకాశం ఉంటుంది. ఎవరైనా బాల్యవివాహం చేసేందుకు ప్రయత్నిస్తే డయల్ 1098కు సమాచారం అందించాలి. – జయ, డీడబ్ల్యూఓ,

గ్రామస్థాయిలో కమిటీలు..

నారాయణపేట జిల్లాగా ఏర్పడిన తర్వాత ప్రత్యేకంగా మాతాశిశు సంరక్షణ, సఖి కేంద్రాలు ఏర్పాటయ్యాయి. బాల్యవివాహాలతో కలిగే అనర్థాలపై బాలల సంరక్షణ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవివాహాలను నిరోధించడానికి ప్రభుత్వం పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసింది. గ్రామ కమిటీల్లో సర్పంచ్ చైర్మన్‌గా, పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌ఓ, ప్రభుత్వ ఉపాధ్యాయులు, మహిళా సంఘం సభ్యురాలు, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లను సభ్యులుగా నియమించింది. గ్రామీణ ప్రజల్లో చైతన్యం నింపుతూ.. బాల్యవివాహాలను అరికట్టాల్సిన అవసరం ఉండగా.. క్షేత్రస్థాయిలో కమిటీల పనితీరు నామమాత్రంగానే ఉంటుంది.


నారాయణపేట జిల్లా కేంద్రంలోని బాలల రక్ష భవన్

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్


కండక్టర్‌ను సన్మానించి జ్ఞాపికను అందిస్తున్న సజ్జనార్

అభినందించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్

అచ్చంపేట రూరల్/మన్ననూర్: ఆర్టీసీ బస్సులో పోగొట్టుకున్న రూ.13 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదుతో కూడిన బ్యాగును ప్రయాణికుడికి అందజేసి తన నిజాయితీని చాటుకున్నాడు అచ్చంపేట ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్ వెంకటేశ్వర్లు. సోమవారం హైదరాబాద్‌లో ఆర్టీసీ బస్‌భవన్ వద్ద సంస్థ ఎండీ సజ్జనార్, ఉన్నతాధికారులు కండక్టర్‌ను సన్మానించి ప్రశంసా పత్రం అందజేశారు. అచ్చంపేట–హైదరాబాద్ రూట్‌లో అచ్చంపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో ఈ నెల 26న కండక్టర్ వెంకటేశ్వర్లు విధుల్లో ఉండగా, ఎంజీబీఎస్‌కు చేరుకోగానే బస్సులో బ్యాగ్‌ను ప్రయాణికుడు మరచి పోయినట్లు కండక్టర్ గుర్తించాడు. బ్యాగును తెరిచి చూడగా అందులో బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదు, పలు సర్టిఫికెట్లు ఉన్నాయి. వెంటనే ఈ విషయాన్ని అచ్చంపేట డీఎం మురళీ దుర్గాప్రసాద్‌కు ఫోన్‌లో సమాచారం అందించాడు. బ్యాగ్‌ను ఎంజీబీఎస్‌లోని స్టేషన్ మేనేజర్ కార్యాలయంలో అప్పగించాలని డీఎం సూచించారు. ఇంతలోనే అనిల్‌కుమార్ అనే ప్రయాణికుడు డీఎంకి ఫోన్ చేసి బస్సులో బ్యాగును మరచిపోయినట్లు చెప్పాడు. కందుకూర్‌లో బస్సు ఎక్కి సీబీఎస్‌లో దిగి కాచిగూడకు వెళ్లిపోయినట్లు పేర్కొన్నాడు. ఎంజీబీఎస్‌లోని స్టేషన్‌మేనేజర్ కార్యాలయానికి వెళ్లాలని అచ్చంపేట డీఎం సూచించారు. ఆర్టీసీ అధికారులు వివరాలను పరిశీలించి, బ్యాగును ప్రయాణికుడు అనిల్‌కుమార్‌కు అందజేశారు. అందులో 14 తులాల బంగారు, 10 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.14,800 నగదు, తన కుమారుడి బర్త్ సర్టిఫికెట్, తన విద్యార్హత ధ్రువపత్రాలు ఉన్నాయి. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మునిశేఖర్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప, అచ్చంపేట డీఎం మురళీ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామస్తుల ఆనందం

విలువైన ఆభరణాలు, కొంత నగదు, సర్టిఫికెట్లు కలిగి ఉన్న బ్యాగును బస్సులో పోగొట్టుకున్న వ్యక్తికి తిరిగి అప్పగించిన పదర (గ్రామం) మండల కేంద్రానికి చెందిన వెంకటేశ్వర్లును ఆర్టీసీ సంస్థ ఎండీ సజ్జనార్ ప్రశంసించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. తమ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అచ్చంపేట ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా నీతి నిజాయితీతో విధులు నిర్వహించి సుమారు రూ.13 లక్షల విలువైన ఆభరణాలు, వస్తువులు తిరిగిచ్చి గ్రామానికి మంచి పేరు తీసుకురావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా అచ్చంపేట డిపో డీఎం దుర్గాప్రసాద్‌తో పాటు పదర గ్రామానికి చెందిన ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు, నాయకులు రామలింగం, వెంకటయ్య, చంద్రయ్య, సత్యనారాయణ, బాలింగం, రాయుడు తదితరులు సంతోషం వ్యక్తం చేశారు.

అవయవదానంతో ఆరుగురికి ప్రాణదానం


నర్సిబాయ్(ఫైల్)

ఉండవెల్లి: అవయవదానంతో ఆరుగురి ప్రాణం దానం చేసిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని బొంకూరు గ్రామానికి చెందిన నర్సిబాయ్(54) తులసిరావ్ దంపతులు, గత వారంలో నర్సిబాయ్ ఇంట్లో అదుపు తప్పి కింద పడడంతో కర్నూల్ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. బ్రెయిన్ డెడ్ కావడంతో అవయదానానికి కుటుంబ సభ్యులు ఒప్పుకోవడంతో ఆరుగురుకి అవయదానం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం బొంకూరు గ్రామంలో నిర్వహించిన నర్సిబాయ్ అంతిమయాత్రలో కుటుంబ సభ్యులు ప్రజలు పెద్దఎత్తున పాల్గొని ఆమె మృతదేహానికి నివాళులర్పించారు.

చాకల్‌పల్లిలో చోరీ

గోపాల్‌పేట: పొలం వద్ద ఉన్న బోరుమోటారు చోరీ చేస్తుండగా ఇద్దరిని పట్టుకొని పోలీసులకు అప్పగించామని చాకల్‌పల్లి గ్రామస్తులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని చాకల్‌పల్లికి చెందిన లొంక లక్ష్మారెడ్డి ఆదివారం సాయంత్రం ఆరున్నర ప్రాంతంలో పొలానికి వెళ్తుండగా గ్రామ శివారులో ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించారు. కొంత దూరం వెళ్లి మళ్లీ తిరిగొచ్చి చూడగా వారు ఇద్దరూ చెట్లలో దాక్కున్నారు. ఎందుకు ఇక్కడ ఉన్నారని ప్రశ్నించగా సమాధానం దాటవేశారు. లోపలికి వెళ్లి చూడగా వాగులో ఉన్న బోరుమోటారు కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల పరిసరాలు పరిశీలించగా.. ఓ సంచిలో దాచిపెట్టి ఉంచారు. మోటారు చోరీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని భావించిన ఆయన పోలీసులకు సమాచారం అందించి వారు ఇద్దరిని ఆదివారం రాత్రి పోలీసులకు అప్పగించి ఫిర్యాదు చేశారు. కొన్నిరోజులుగా ఇలాగే బోరుమోటార్లు చోరీకి గురవుతున్నాయని బాధితుడు వాపోయాడు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు

జడ్చర్ల: విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కమలాకర్ తెలిపారు. సీఐ కథనం మేరకు.. జడ్చర్ల మండలంలో విద్యుత్ లైన్‌మన్‌గా పనిచేస్తున్న నెనావత్ శ్రీనివాస్ సోమవారం తంగెళ్లపల్లి గ్రామ శివారులో తెగిన విద్యుత్ లైన్‌ను సరిచేస్తుండగా.. సుదర్శన్ అనే వ్యక్తి అక్కడికి వచ్చి లైన్‌మన్‌ను దుర్భాషలాడుతూ మోటారు బైక్‌ను ధ్వంసం చేయడంతో పాటు విధులకు ఆటంకం కలిగించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

వేసవి దుక్కు.. సాగు బాగు


వేసవిలో దుక్కులు చేస్తున్న రైతులు


లోతు దుక్కులు

పాడి–పంట
గద్వాల జిల్లా వ్యవసాయాధికారి, సక్రియానాయక్

అలంపూర్: సాగు ఆరంభంలో చేపట్టే కొన్ని పనులు దిగుబడిపై అధిక ప్రభావం చూపుతాయని, వీటిలో వేసవి దుక్కులు ప్రధానమని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియానాయక్ రైతులకు సూచించారు. వేసవి దుక్కుల లాభాల గురించి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఈ విధంగా వివరించారు.

వేసవి దుక్కి అంటే..

ఖరీఫ్ సాగుకు ముందుగా వేసవిలో పొలాన్ని లోతుగా దున్నే విధానాన్ని వేసవి దుక్కి అంటారు.

వేసవి దుక్కితో లాభాలు..

పోషకాల పెంపు..

నేల లోపలి గట్టి పొరలను పగులగొట్టడం వలన మొక్కల వేరు వ్యవస్థ లోపలికి చొచ్చుకొని వస్తాయి. వేరు వ్యవస్థ నేలలోకి బాగా విస్తరించడం వలన మొక్కల ఎదుగుదలకు కావాల్సినంత తేమ పోషకాలు సమకూరుతాయి. దీంతో నాణ్యమైన దిగుబడి వస్తుంది. పంటలకు మేలు చేసే సూక్ష్మజీవుల చర్యలను కూడా అభివృద్ధి పరుచుటకు వేసవి దుక్కులు తోడ్పడతాయి.

కలుపు నివారణ..

లోతు దుక్కుల వలన పొలంలో ఉండే మొండి జాతి కలుపు మొక్కలైన గరిక, తుంగ వంటి మొదలగు దుంపలతో సహా పెకిలించవచ్చు. దీంతో కలుపు సమస్య తగ్గుతుంది.

పురుగుల నిర్మూలన..

తొలకరి వర్షాలు పడిన వెంటనే భూమిని లోతుగా దున్ని కింది నేలను పైకి వచ్చేట్లు చేయడం వలన నిద్రావస్థలో ఉన్న వివిధ పురుగుల గుడ్లు, ప్యూపాలు సూర్యరశ్మి తాకిడికి చనిపోతాయి. వేసవి దుక్కుల వలన వరి పైరును ఆశించే కాండం తొలుచు పురుగు, మొక్కజొన్నలో వచ్చే పురుగుల ఉధృతి తగ్గించవచ్చు.

తెగుళ్ల నివారణ..

సాగు కాలంలో పైరును ఆశించే వివిధ రకాల శిలీంద్రాలు వేసవిలో చేపట్టే లోతు దుక్కుల వలన ఎండ తాకిడికి చనిపోతాయి. తర్వాత పంట కాలంలో తెగుళ్ల తీవ్రత తగ్గుతుంది. ఉదాహరణకు వివిధ పంటల్లో వచ్చు ఎండు తెగుళ్లను వేసవి దుక్కుల వలన తగ్గు ముఖం పట్టించవచ్చు.

నేలలో తేమ నిల్వ శాతం వృద్ధి

ప్రాథమికంగా వేసవి దుక్కుల వలన తొలకరిలో పడే వర్షపు నీరు నేలలోకి బాగా ఇంకి భూగర్భ నీటిమట్టం పెరుగుతుంది. దీంతో పాటు నేలలో తేమ నిల్వ శాతం వృద్ధి చెందుతుంది. నీరు బాగా ఇంకడం వలన నేల గుల్లబారి విత్తనం నాటేందుకు అనుకులంగా మారుతుంది. తద్వార మొలక శాతం పెరుగుతుంది. ముందు పంట మొదళ్లు, చెత్త ఆకులు, నేలలో కలిసి సేంద్రియ పదార్థంగా మారి నేల సారవంతంగా మారుతుంది.

సహాయక చర్యలకు విరామం


ఎస్ఎల్‌బీసీ సొరంగంలో నిషేధిత ప్రదేశం వరకు చేపట్టిన సహాయక చర్యలు

- ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం
- టెక్నికల్ కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు
- ప్రశ్నార్థకంగా మారిన ఆరుగురు కార్మికుల ఆచూకీ


నిషేధిత ప్రదేశం నుంచి వస్తున్న నీటిఊట

అచ్చంపేట: ఎస్ఎల్‌బీసీ సొరంగంలో సహాయక చర్యలు నిలిపివేయాలని సోమవారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మంగళవారం నుంచి సొరంగం ప్రమాద ప్రదేశంలో సహాయక చర్యలకు విరామం ఇవ్వనున్నారు. సాంకేతిక కమిటీ సూచన మేరకు 66 రోజుల తర్వాత సహాయక చర్యలు నిలిచిపోనున్నాయి. సోమవారం హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్ తదితర విభాగాలకు చెందిన సహాయక సిబ్బంది నిషేధిత ప్రదేశంలో 10 మీటర్ల వరకు పేరుకుపోయిన మట్టి, బురద, రాళ్లను తొలగించి కన్వేయర్ బెల్టు ద్వారా, టీబీఎం భాగాలను లోకో ట్రైన్ ద్వారా బయటకు తరలించారు. మరోవైపు టీబీఎం భాగాలు మినహా తవ్వకం పనులు దాదాపుగా నిర్దేశిత ప్రదేశం వరకు పూర్తిచేశారు. డీ–2, డీ–1 ప్రదేశం వరకు 281 మీటర్ల వరకు తవ్వకాలు పూర్తి కాగా.. నిషేధిత 43 మీటర్ల ప్రదేశంలో పేరుకుపోయిన మట్టి, ఇతర శిథిలాల తొలగింపు మిగిలింది. ఫిబ్రవరి 22న సొరంగంలో 13.936 కి.మీ. ప్రమాదం చోటు చేసుకోగా.. 8మంది కార్మికులు గల్లంతయ్యారు. వీరిలో ఇద్దరి మృతదేహాలను సహాయక సిబ్బంది వెలికితీశారు. మిగతా ఆరుగురి జాడ కోసం 66 రోజులుగా వివిధ రకాలుగా అన్వేషణ కొనసాగించారు. అడుగడుగునా గాలించినా కార్మికుల ఆచూకీ లభించలేదు. నిషేధిత ప్రదేశంలో గల్లంతైన కార్మికులు ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ ప్రదేశంలో తవ్వకాలు జరిపితే తప్ప వారిని గుర్తించడం సాధ్యం కాదు. ప్రస్తుతానికి శిథిలాలతో పేరుకుపోయిన 43 మీటర్ల ప్రదేశంలో తవ్వకాలకు ప్రభుత్వం కొంతకాలం వాయిదా వేసింది. సహాయక చర్యలు ముగియడంతో సొరంగం లోపల నుంచి సామగ్రి, ఎక్స్‌వేటర్లను బయటకు తెచ్చారు. సొరంగం లోపలి పరిస్థితులను తెలుసుకునేందుకు ప్రభుత్వం ఇటీవల 12 మందితో కూడిన సాంకేతిక కమిటీని నియమించింది. ఈ నెల 24న కమిటీ సమావేశమై సాధ్యాసాధ్యాలను తేల్చేందుకు సబ్ కమిటీని నియమించింది. ఈ కమిటీ అధ్యయనం తర్వాత ప్రభుత్వానికి సమర్పించే నివేదిక ఆధారంగా ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు ముందుకు సాగనున్నాయి. కాగా, సహాయక చర్యల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ, ఆర్మీ, దక్షిణమధ్య రైల్వే, నేవీ, ర్యాట్‌హోల్ మైనర్స్, హైడ్రా, ఎస్ఆర్ఎస్, జీఎస్ఐ, ఎన్‌జీఆర్ఐ, రోబోటిక్ కంపెనీ వంటి 12 సంస్థలకు చెందిన 800 మంది భాగస్వాములయ్యారు. వీరితో పాటు కార్మికుల అవశేషాలను గుర్తించేందుకు స్నీపర్, క్యాడవర్ డాగ్స్‌తో అన్వేషణ సాగించారు. జేపీ కంపెనీ, రెవెన్యూ, పంచాయతీరాజ్, ట్రాన్స్‌కో, గిరిజన సంక్షేమశాఖలు వివిధ రకాల సేవలు అందించాయి. సొరంగంలో తవ్వకాలు నిలిపివేయడంతో ఆరుగురి కార్మికుల ఆచూకీ ప్రశ్నార్థకంగా మారింది.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



కొల్లాపూర్ రూరల్: వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మండలంలోని ఎల్లూరు సమీపంలో ఉన్న మిషన్ భగీరథ పంప్‌హౌజ్, వాటర్ ఫిల్టర్లు, నీటి సరఫరాకు సంబంధించిన పనులను ఆయన పరిశీలించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పుడికప్పుడు పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎస్ఈ జగన్మోహన్, ఈఈ సుధాకర్, డీఈలు, అంజత్‌పాషా, మల్లేశ్వరావు తదితరులు ఉన్నారు

దాడిచేసిన వారిపై కేసు నమోదు

జడ్చర్ల: పట్టణంలోని కొత్త బస్టాండ్ వైపు నుంచి సిగ్నల్‌గడ్డ వైపు నడుచుకుంటూ వస్తున్న కొంగలి లక్ష్మయ్య అనే వ్యక్తిపై అకారణంగా దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కమలాకర్ తెలిపారు. తనపైకి నిర్లక్ష్యంగా బైక్‌తో దూసుకువచ్చిన వ్యక్తిని కాస్త మందలించడంతో గంగాపూర్‌కు చెందిన అరవింద్, శశికుమార్, మరో ఇద్దరు దాడి చేశారని.. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

నిప్పంటుకొని మహిళకు గాయాలు

మహమ్మదాబాద్: ప్రమాదవశాత్తు మహిళ ఒంటికి నిప్పంటుకొని గాయపడిన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు మహమ్మదాబాద్‌కు చెందిన రుక్కుంపల్లి ఆశమ్మ తన వ్యవసాయ పొలంలో ముళ్లకంపను కాల్చి వేస్తుండగా.. ప్రమాదవశాత్తు ఆమె ఒంటికి నిప్పంటుకోవడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

మిర్చి రైతులకు ఎగనామం

మానవపాడు: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేసిన ముగ్గురు వ్యాపారులు.. అందుకు సంబంధించిన డబ్బులు చెల్లించకుండా ఎగనామం పెట్టారు. వివరాల్లోకి వెళ్తే.. మానవపాడు మండలం బోరవెల్లి గ్రామంలో 40 రోజుల క్రితం మిర్చి పంటను కొనుగోలు చేసేందుకు ముగ్గురు వ్యాపారులు వచ్చారు. మండలానికి చెందిన ఇద్దరు బ్రోకర్ల సహాయంతో వారు బోరవెల్లిలో 10 మంది రైతుల నుంచి దాదాపు 280 నుంచి 300 క్వింటాళ్ల మిర్చి కొనుగోలు చేశారు. అందుకు సంబంధించి రైతులకు రూ. 30 లక్షలపైగా చెల్లించాల్సి ఉంది. అయితే బ్రోకర్ల ద్వారా కొనుగోలు చేసిన మిర్చిని గుంటూరులోని మిర్చియార్డుకు తరలించారు. అక్కడ బ్రోకర్ల కళ్లుగప్పి ఆ ముగ్గురు పరారయ్యారు. వారికి ఫోన్ చేస్తే స్విచాఫ్ రావడంతో వారు చేసేది లేక ఖాళీ చేతులతో స్వగ్రామానికి చేరుకున్నారు. నాటి నుంచి బాధిత రైతులకు నేడు, రేపు డబ్బులు వస్తాయని చెబుతూ వస్తున్నారు. కాగా, మిర్చి విక్రయించిన రైతులకు సదరు వ్యాపారులు బాండ్ రాసిచ్చి నమ్మించినట్లు తెలిసింది. రైతులను మోసం చేసిన వ్యాపారులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

చిరుత మకాం మార్చిందా..?


చిరుత నివాసం ఏర్పాటు చేసుకున్న దేవరగుట్ట ప్రాంతం

సీసీ కెమెరాలకు సైతం చిక్కని వైనం

నవాబుపేట: మండలంలోని యన్మన్‌గండ్ల దేవరగుట్ట పరిసరాల్లో సంచరిస్తున్న చిరుత కొన్ని రోజులుగా కనిపించడం లేదని అటవీ శాఖ అధికారులు తెలిపారు. చిరుత సంచారం గురించి తెలుసుకున్న అధికారులు పది రోజుల క్రితం సీసీ కెమెరాలు, బోన్లను ఏర్పాటు చేశారు. బోను ఏర్పాటు చేసిన రోజు చిరుత వేరే చోట కనిపించినా.. ఆ తర్వాత సీసీ కెమెరాల్లో సైతం జాడ లేకుండా పోయింది. ఇదిలా ఉంటే తాజాగా సోమవారం చిరుత దేవరగుట్ట ప్రాంతం నుంచి కూచూర్ వెళ్లే దారిలో దర్గా సమీపంలోని గుట్టలోకి తరలినట్లు అక్కడి పరిసర పొలాల రైతులు తెలిపారు. దీంతో అటవీ శాఖ సిబ్బంది సైతం చిరుత కోసం అమర్చిన సీసీ కెమెరాలను పరిశీలించినా ఆచూకీ కనబడలేదన్నారు. అధికారులు అమర్చిన ఉచ్చును గుర్తించిన చిరుత తరుచూ మకాం మారుస్తోంది వివరించారు. దీంతో యన్మన్‌గండ్ల గ్రామస్తుల్లో ఉన్న చిరుత భయం ఇప్పట్లో పోయో అవకాశం లేక పోగా.. పరిసర గిరిజన తండాలకు పట్టుకుంది. దీంతో చిరుత చిక్కకుండా తిరుగుతుండడంతో అధికారులు, ఇటు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆయా పరిసర గ్రామాల ప్రజలు చిరుత సంచారం ఉన్న ప్రాంతంలో సంచరించరాదని, పశువులను ఉంచరాదని అటవీశాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.